
సాక్షి
మంచిర్యాల
గురువారం ׀ 1 ׀ మే ׀ 2025



వడగళ్ల వానకు అతలాకుతలం

జిల్లాలోని పలు మండలాల్లో బుధవారం వడగళ్లతో కూడిన గాలివాన కురిసింది. వడ్లు, మామిడికాయలు నేలరాలాయి. రేకుల ఇళ్ల పైకప్పులు ఎగిరిపోయాయి.

IIలో ▶



విత్తన పూజకు వేళాయె

జంగుబాయి అమ్మవారి పుణ్యక్షేత్రంలో విత్తన పూజకు ఆదివాసీలు శ్రీకారం చుట్టనున్నారు. నెల రోజులపాటు ఉత్సవాలు నిర్వహించనున్నారు.

IIలో ▶

గరిష్టం/కనిష్టం
40.0 /28.0

వాతావరణం

ఆకాశం మేఘావృతమై ఉంటుంది. వడగాలులు బలంగా వీస్తాయి. ఉక్కపోతగా ఉంటుంది.

నగరంలో సమస్యలా..?

ఫోన్ చేయండి.. నేడు కమిషనర్‌తో 'సాక్షి' ఫోన్ ఇన్



కమిషనర్ శివాజి

మంచిర్యాలటౌన్: మంచిర్యాల కార్పొరేషన్ కమిషనర్ శివాజీతో గురువారం 'సాక్షి' ఆధ్వర్యంలో ఫోన్ ఇన్ కార్యక్రమం నిర్వహిస్తోంది. మంచిర్యాల కార్పొరేషన్ పరిధిలో తాగునీరు, పారిశుద్ధ్యం, డ్రెయినేజీ, ఇంటి అనుమతులు, వీధి దీపాలు, వార్డుల్లోని సమస్యలను నేరుగా కమిషనర్ దృష్టికి తీసుకెళ్లవచ్చు.

సమయం: గురువారం
ఉదయం 11 గంటల నుంచి 12గంటల వరకు
నంబరు:
9849905886

మూడు స్థానాలు ముందుకు..!

- మెరుగైన 'పది' ఫలితాలు
- 96.54శాతం ఉత్తీర్ణత
- రాష్ట్రస్థాయిలో 17వ స్థానం

నాలుగేళ్లుగా ఫలితాలు

సంవత్సరం	విద్యార్థులు	ఉత్తీర్ణత
2021–22	10522	9528
2022–23	10071	8552
2023–24	9283	8579
2024–25	9179	8861

సంవత్సరం	ఉత్తీర్ణత శాతం..		
	బాలురు	బాలికలు	శాతం
2021–22	88.44	99.82	90.55
2022–23	82.91	87.00	84.87
2023–24	91.36	93.52	92.42
2024–25	96.14	96.96	96.54



మోడల్‌స్కూల్ విద్యార్థులను అభినందిస్తున్న జిల్లా కలెక్టర్ కుమార్‌దీపక్

మంచిర్యాలఅర్బన్: పదో తరగతి ఫలితాల్లో జిల్లా గతంతో పోల్చితే ఈసారి మెరుగైన ఫలితాలు సాధించింది. జిల్లా 2023–24లో రాష్ట్రస్థాయిలో 20వ స్థానంలో నిలువగా.. ఈసారి మూడు స్థానాలు మెరుగుపర్చుకుని 17వ స్థానంలో నిలిచింది. బుధవారం ప్రభుత్వం ఫలితాలు విడుదల చేసింది. గత ఏడాది 92.42శాతం ఉత్తీర్ణత సాధించగా.. ఈ ఏడాది 96.54కు ఉత్తీర్ణత శాతం పెరిగింది. మొత్తం 9,179మంది విద్యార్థులు పరీక్షలు రాయగా 8,861మంది ఉత్తీర్ణత సాధించారు. 318మంది అనుత్తీర్ణులయ్యారు. బాలురు 4,743మంది పరీక్షకు హాజరు కాగా 4,560మంది పాసయ్యారు. బాలికలు 4,436మంది పరీక్షకు హాజరు కాగా 4,301మంది ఉత్తీర్ణత పొందారు. బాలుర ఉత్తీర్ణత శాతం 96.14 కాగా, బాలికలు 96.96ఉత్తీర్ణత శాతంతో పై చేయి సాధించారు. ఫెయిలైన వారిలో బాలురు 183మంది, బాలికలు 135మంది ఉన్నారు. ఫలితాల్లో 2022–23లో 23 స్థానం, 2023–24లో 20వ స్థానం సాధించగా రెండేళ్లుగా వరుసగా మరో మూడడుగులు(ఈ ఏడాది) సాధించి స్థానాన్ని 'పది'ల పర్చుకుంది.

మోడల్‌స్కూల్ విద్యార్థుల ప్రతిభ

మంచిర్యాల మోడల్‌స్కూల్ విద్యార్థులు ప్రతిభ చూపారు. 98 మందికి 95మంది ఉత్తీర్ణత సాధించారు. దినసరి కూలీ కుటుంబానికి చెందిన నల్లచరణ్ 600 మార్కులకు గాను 571 మార్కులు, వ్యవసాయ కుటుంబానికి చెందిన దుర్గం నక్షత్ర 566, కోడూరి ఆదిత్య 563 మార్కులు సాధించారు. ఉత్తమ ఫలితాలు సాధించిన విద్యార్థులను కుటుంబసభ్యుల సమక్షంలో పాఠశాల ఉపాధ్యాయులు ఘనంగా సన్మానించారు. జిల్లాలోని ఐదు మోడల్ స్కూళ్లలో 571 మార్కులతో చరణ్ మొదటి స్థానం సాధించాడని ప్రిన్సిపాల్ బుచ్చన్న తెలిపారు.

జిల్లా టాపర్‌గా సాయి శ్రీవల్లి



సాయి శ్రీవల్లి

పదో తరగతి ఫలితాల్లో స్థానిక ప్రైవేట్ పాఠశాల విద్యార్థిని సాయి శ్రీవల్లి 588 మార్కులతో జిల్లా టాపర్‌గా నిలిచింది. తల్లిదండ్రులు మధుబాబు, ఉమ ప్రభుత్వ ఉపాధ్యాయులు. సాయి శ్రీవల్లి జపాన్ సకురా ప్రోగ్రాంకు ఎంపిక కాగా ఈ ఏడాది జూన్ 13న బయలుదేరి జపాన్‌లో 15 నుంచి 21 వరకు నిర్వహించే కార్యక్రమంలో పాల్గొననుంది. జాతీయ ఇన్‌స్పైర్ అవార్డు పొందడంతోపాటు రాష్ట్రపతి నుంచి ప్రశంసలు అందుకుంది. ఆస్ట్రోనాట్‌గా అంతరిక్షంలో అడుగుపెట్టి పరిశోధనలు చేయాలన్నదే లక్ష్యంగా పెట్టుకున్నట్లు సాయి శ్రీవల్లి తెలిపింది.

ఇంజినీర్ అవుతా..

మా నాన్న కూలీ పని చేస్తూ జీవనం సాగిస్తున్నారు. ఇంజినీర్ కావాలని లక్ష్యంగా పెట్టుకున్నాను. అందుకు పదో తరగతి మొదటి మెట్టుగా భావించి ఇష్టపడి చదివాను. ఉపాధ్యాయుల సహకారం, తల్లిదండ్రుల ప్రోత్సాహంతో 571 మార్కులు సాధించాను. ఐఐటీలో చేరాలని ఉంది.

– నల్ల చరణ్, మంచిర్యాల మోడల్ స్కూల్ విద్యార్థి

ప్రభుత్వ పాఠశాలల్లో వందశాతం ఉత్తీర్ణత

మంచిర్యాలఅర్బన్: జిల్లాలో 167 ప్రభుత్వ పాఠశాలల్లో 78 పాఠశాలలు ఉత్తమ ఫలితాలతో వంద శాతం సాధించాయి. ప్రైవేట్ పాఠశాలల కంటే ముందు వరుసలో నిలిచాయి. ఇందులో 101 లోకల్‌బాడీ పాఠశాలల్లో 46 స్కూళ్లు వందశాతం దూసుకెళ్లాయి. రెండో స్థానంలో 45 ప్రైవేట్(నూరు శాతం) పాఠశాలలు సరిపెట్టుకున్నాయి. 10 కేజీబీవీలు నూరుశాతం ఉత్తీర్ణత సాధించాయి. జీపీహెచ్‌ఎస్–6 టీఎస్‌డబ్ల్యూఆర్‌ఎస్–6, టీఎస్ఎంఎస్–3, ఎంజేపీ–5, ఎయిడెడ్–1, టీఎంఆర్‌ఎస్–1 వందశాతం ఫలితాలు సాధించాయి. టీఎస్ఆర్‌ఎస్, 7 ప్రభుత్వ ఉన్నత పాఠశాలల్లో ఒకటి కూడా నూరు శాతం ఫలితాలు సాధించలేకపోయాయి.

పాఠశాలల వారీగా...

యాజమాన్యం	స్కూల్ సంఖ్య	హాజరైన విద్యార్థులు	ఉత్తీర్ణత
లోకల్‌బాడీ	101	2801	2649
ఎయిడెడ్	02	193	190
జీపీహెచ్‌ఎస్	14	382	363
జీహెచ్‌ఎస్	07	208	175
కేజీబీవీ	18	642	622
ఎంజేపీ	07	439	436
టీఎంఆర్‌ఎస్	03	134	125
టీఎస్ఎంఎస్	05	443	432
టీఎస్ఆర్‌ఎస్	01	68	66
టీఎస్‌డబ్ల్యూ ఆర్‌ఎస్	09	672	668
ప్రైవేట్	80	3196	3136
మొత్తం	247	9179	8861

భూభారతి చట్టంతో భూమిపై హక్కు

- జిల్లా కలెక్టర్ కుమార్ దీపక్



రైస్‌మిల్లును పరిశీలిస్తున్న జిల్లా కలెక్టర్ కుమార్ దీపక్, అదనపు కలెక్టర్ మోతీలాల్

మంచిర్యాలటౌన్: భూభారతి నూతన ఓఆర్‌ఆర్ చట్టంతో రైతులకు భూమిపై హక్కు, రికార్డుల్లో తప్పుల సవరణకు అవకాశం కల్పించినట్లు జిల్లా కలెక్టర్ కుమార్ దీపక్ తెలిపారు. జిల్లా కేంద్రంలోని మైనారిటీ ఫంక్షన్ హాలులో బుధవారం భూభారతి నూతన ఆర్‌ఓఆర్ చట్టంపై అవగాహన కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ గ్రామాల్లో నెలకొన్న సమస్యలపై దరఖాస్తులు స్వీకరించి ఆగస్టు 15లోపు పరిష్కరించేలా చర్యలు తీసుకుంటామని అన్నారు. ఈ కార్యక్రమంలో జిల్లా అదనపు కలెక్టర్ సబావత్ మోతీలాల్, మంచిర్యాల ఆర్డీవో శ్రీనివాసరావు, వ్యవసాయ శాఖ సహాయ సంచాలకులు అనిత పాల్గొన్నారు.

రైస్‌మిల్లుల తనిఖీ..

లక్సెట్టిపేట: రైస్‌మిల్లుల యాజమాన్యాలు త్వరితగతిన ధాన్యం అన్‌లోడింగ్ చేసుకోవాలని కలెక్టర్ కుమార్ దీపక్ అన్నారు. బుధవారం లక్సెట్టిపేటలో రైస్‌మిల్లులను జిల్లా అదనపు కలెక్టర్ సబావత్ మోతీలాల్‌తో కలిసి ఆకస్మికంగా తనిఖీ చేశారు. ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ మాట్లాడుతూ ఆలస్యం చేయకుండా ఎక్కువ మంది హమాలీలను నియమించుకోవాలని తెలిపారు.

న్యూస్‌రీల్

ధాన్యం సేకరణ వేగవంతం చేయాలి

మంచిర్యాలఅగ్రికల్చర్: యాసంగి ధాన్యం కొనుగోలు ప్రక్రియ వేగవంతం చేయాలని రాష్ట్ర నీటి పారుదల, పౌరసరఫరాల శాఖ మంత్రి ఉత్తమ్‌కుమార్‌రెడ్డి అన్నారు. బుధవారం హైదరాబాద్ నుంచి రాష్ట్ర పౌరసరఫరాల శాఖ కమిషనర్ డీఎస్.చౌహాన్‌తో కలిసి వీడియో కాన్ఫరెన్స్ ద్వారా జిల్లా కలెక్టర్, అదనపు కలెక్టర్, అధికారులతో ధాన్యం కొనుగోలు మిల్లులు, గోదాములకు తరలింపు, కొనుగోలు కేంద్రాల్లో సౌకర్యాలు, అకాల వర్షాలు, ఎండ తీవ్రత దృష్ట్యా తీసుకోవాల్సిన జాగ్రత్తలపై సమీక్ష సమావేశం నిర్వహించారు. మంత్రి మాట్లాడుతూ రైతులకు ఎలాంటి ఇబ్బందులు తలెత్తకుండా తాగునీరు, నీడ, ఓఆర్ఎస్, గన్ని సంచులు, టార్పాలిన్లు, ఇతర మౌలిక సదుపాయాలు కల్పించాలని తెలిపారు. కొనుగోలు చేసిన ధాన్యాన్ని ట్యాగింగ్ ఇచ్చిన మిల్లులకు వెంటనే తరలించాలని, అకాల వర్షాలకు తడవకుండా ప్రత్యేక చర్యలు తీసుకోవాలని, సీఎంఆర్ డిఫాల్టర్ రైస్ మిల్లులపై చర్యలకు ఉపక్రమించాలని తెలిపారు.

బసవేశ్వరుడి సేవలు మరువలేం



నివాళులర్పిస్తున్న కలెక్టర్ కుమార్ దీపక్

మంచిర్యాలఅగ్రికల్చర్: సమాజంలో కుల వ్యవస్థను వ్యతిరేకించి ఆధ్యాత్మికతను ప్రేరేపించిన మహనీయుడు బసవేశ్వరుడు అని, ఆయన సేవలు మరువలేనివని జిల్లా కలెక్టర్ కుమార్ దీపక్ అన్నారు. బుధవారం సమీకృత కలెక్టరేట్ మందిరంలో జిల్లా వెనుకబడిన తరగతుల అభివృద్ధి శాఖ ఆధ్వర్యంలో బసవేశ్వరుడి జయంతి వేడుకలు నిర్వహించారు. కలెక్టర్‌తోపాటు జిల్లా అదనపు కలెక్టర్ మోతీలాల్, జిల్లా వెనుకబడిన తరగతుల అభివృద్ధి అధికారి పురుషోత్తం విశ్వగురు బసవేశ్వరుని చిత్రపటం వద్ద జ్యోతిని వెలిగించి ఘనంగా నివాళులర్పించారు. ఈ కార్యక్రమంలో వివిధ శాఖల జిల్లా అధికారులు, కుల సంఘాల ప్రతినిధులు పాల్గొన్నారు.

ఆర్టీసీ డీఎంగా శ్రీనివాసులు

మంచిర్యాలఅర్బన్: మంచిర్యాల ఆర్టీసీ డీఎంగా టి.శ్రీనివాసులును నియమిస్తూ ఉత్తర్వులు జారీ అయ్యాయి. ఇదివరకు డీఎంగా విధులు నిర్వర్తిస్తున్న జనార్దన్ ఉద్యోగ విరమణ పొందగా వరంగల్–1 డిపోలో అసిస్టెంట్ ఇంజనీర్(మెకానిక్)గా విధులు నిర్వర్తిస్తున్న శ్రీనివాసులు పదోన్నతిపై మంచిర్యాలకు రానున్నారు.

తడి, పొడి చెత్త వేరు చేయాలి

మంచిర్యాలరూరల్(హాజీపూర్): జిల్లాలోని ప్రతీ గ్రామ పంచాయతీలో ఇకపై రోజూవారీగా తడి, పొడి చెత్త వేర్వేరుగా చేస్తూ సెగ్రిగేషన్ షెడ్‌కు తరలించాల్సిందేనని జిల్లా పంచాయతీ అధికారి(డీపీఓ) వెంకటేశ్వర్‌రావు ఆదేశించారు. పంచాయతీరాజ్ డైరెక్టర్ శ్రీజన బుధవారం రాష్ట్రంలోని జెడ్పీ సీఈఓలు, డీపీఓలతో గూగుల్ మీట్ నిర్వహించారు. అనంతరం జిల్లాలోని మండల పంచాయతీ అధికారులతో డీపీఓ ప్రత్యేక సమావేశం ఏర్పాటు చేశారు. జెడ్పీ సీఈఓ గణపతితో కలిసి డీపీఓ మాట్లాడుతూ గ్రామాల్లో ఉపాధి హామీ పనుల్లో పంచాయతీ కార్యదర్శులు విధిగా భాగస్వామ్యమై కార్మికుల సంఖ్య పెంచడంతోపాటు కూలి అందేలా చూడాలన్నారు. సమావేశంలో బెల్లంపల్లి ఇంచార్జీ డీఎల్‌పీఓ సఫ్దర్‌అలీ, ఎంపీఓలు శ్రీపతి బాపు, అజ్మత్‌అలీ పాల్గొన్నారు.

బస్తా దిగదు.. బండి కదలదు..



మందమర్రి మండలం అందుగులపేట రైస్‌మిల్లు వద్ద ధాన్యంలోడ్‌తో లారీలు

- రైస్‌మిల్లర్ల తిరకాసు
- మిల్లుల ఎదుట ధాన్యం లారీలు
- కిలోమీటర్ల మేర బారులు
- అధికలోడు.. ఎండవేడిమితో పేలుతున్న టైర్లు

మంచిర్యాలఅగ్రికల్చర్: కొనుగోలు కేంద్రాల్లో ధాన్యం కుప్పలు పేరుకుపోతుండగా.. మిల్లుల ఎదుట కిలోమీటర్ల మేర లారీలు బారులు తీరుతున్నాయి. బస్తాలను దింపకపోవడంతో ఒక్కో మిల్లు ఎదుట 20 నుంచి 30 లారీలు ఉంటున్నాయి. జన్నారం, దండేపల్లి, లక్సెట్టిపేట, హాజీపూర్, జైపూర్, భీమారం మండలాల్లో ధాన్యం కొనుగోలు కేంద్రాలకు వస్తోంది. జిల్లా వ్యాప్తంగా ఐకేపీ, పీఏసీఎస్, మెప్మా ఆధ్వర్యంలో 332 కొనుగోలు కేంద్రాలు ప్రారంభించగా.. 138 కేంద్రాల్లో ధాన్యం వస్తోంది. కొనుగోలు కేంద్రాల నుంచి జిల్లాలోని 11రైస్‌మిల్లులకు ధాన్యం దించుకునేందుకు ట్యాగింగ్ ఇచ్చారు. జిల్లాలో ఓ వైపు ఎండలు మండిపోతుండగా.. అకాల వర్షాలు వెంటాడుతున్నాయి. ఎండ వేడిమి..అధిక లోడ్ కారణంగా లారీల టైర్లు పేలిపోవడంతోపాటు లారీ పాడై నష్టపోవాల్సి వస్తోందని డ్రైవర్లు, యజమానులు వాపోతున్నారు. తూకం వేసిన ధాన్యం అన్‌లోడ్ కోసం లారీలు ఐదారు రోజులపాటు రైస్‌మిల్లుల వద్ద ఉంటున్నాయి. తాలు, తప్ప, ధాన్యం గింజ విరిగి నూక ఎక్కువగా వస్తున్నాయంటూ ధాన్యం దించుకునేందుకు మిల్లర్లు తిరకాసు పెడుతున్నారు. సెంటర్ నిర్వాహకులు మిల్లు యజమానులతో బస్తాకు రెండు మూడు కిలోల కోతకు ఒప్పుకుంటే దించుకునేందుకు ఒప్పందం చేసుకుంటున్నట్లు తెలుస్తోంది. లారీలు అన్‌లోడ్ అయి రాకపోవడం, తూకం వేయకపోవడంతో రైతులు పడిగాపులు కాస్తున్నారు. తరుగు కోసమే తిరకాసు పెడుతున్నారని, ఆలస్యం చేయకుండా ధాన్యం తూకం వేసి దించుకోవాలని కోరుతున్నారు.

కేంద్రాల్లో భారీగా ధాన్యం

జిల్లాలో 3.25లక్షల మెట్రిక్ టన్నుల ధాన్యం కొనుగోలు కేంద్రాలకు వస్తుందని అధికారులు అంచనా వేశారు. ఇప్పటివరకు 2,724మంది రైతుల నుంచి 24,603.160 మెట్రిక్ టన్నుల ధాన్యం సేకరించారు. 16,466.040 మెట్రిక్ టన్నులు మిల్లులకు తరలించాల్సి ఉండగా, 8,137.120 మెట్రిక్ టన్నుల ధాన్యం తూకం వేసి సిద్ధంగా ఉంది. ఇప్పటివరకు 696లారీల్లో ధాన్యం మిల్లులకు తరలించగా.. అన్‌లోడ్ కోసం 311 లారీలు ఎదురుచూస్తున్నాయి. మరోవైపు వరి కోతలు వేగవంతం కావడంతో కొనుగోలు కేంద్రాలకు ధాన్యం పోటెత్తుతోంది. ధాన్యం ఆరబోసుకునే వీలు లేకుండా నిల్వలు ఉంటున్నాయి. తూకం వేసిన ధాన్యం మిల్లులకు తరలించకపోవడంతో కుప్పలు పేరుకుపోతున్నాయి. జిల్లా వ్యాప్తంగా సుమారు 15వేల నుంచి 20 వేల బస్తాలతోపాటు ధాన్యం రాశులు కుప్పలుగా కనిపిస్తున్నాయి. దీంతో కొత్తగా కాంటా వేసేందుకు స్థలం లేక నిలిపి వేస్తున్నారు.

లారీటైర్ పేలింది..



ఏప్రిల్ 26న దండేపల్లి మండలం వెల్గనూర్ సెంటర్ నుంచి ధాన్యం లోడుతో మందమర్రి మండలం అందుగులపేట రైస్‌మిల్లుకు వచ్చిన.. రోజుల తరబడి ధాన్యం బస్తాలోడు, ఎండతో లారీ టైర్ పగిలిపోయింది. ఇప్పటికే రూ.20 వేల వరకు నష్టం. ఇంకో టైర్ కూడా పగిలిపోయేలా ఉంది.

–ఎస్.నర్సయ్య, డ్రైవర్, గ్రామం: వెల్లనూర్, మం: దండేపల్లి

నాలుగు రోజులైంది..



లక్సెట్టిపేట మండలం కొమ్ముగూడెం సెంటర్ నుంచి అందుగులపేట రైస్‌మిల్లుకు వడ్లు తీసుకవచ్చి నాలుగు రోజులైతంది. లారీ కదులతలేదు. బస్తాలు దిగుత లేవు. ఇన్నే తినుడు, ఇన్నే పండుడు అయితంది. ఆలస్యం చేయకుండా వడ్లు దించుకోవాలే..

–పాషా, లారీ డ్రైవర్

ఎప్పుడు దించుకుంటరో..



వడ్ల లారీలు మందమర్రి హైవే మీద కిలోమీటర్ మేర లైన్ కట్టినై. ఎప్పుడు వడ్లు దించుకుంటారో ఏమో తెలుస్తలేదు. సెంటరోళ్లు వచ్చి మిల్లు ఓనర్లతో మాట్లాడితే తప్ప దించుకునేలా లేరు. వడ్ల ఒప్పందాలు ఏమో మాకు తెలవ్వడం లేదు. మేము మాత్రం పగలు, రాత్రి, ఎండకు వానకు లారీల వద్దనే రోజుల తరబడి ఉంటున్నాం.

– అబ్దుల్లా డ్రైవర్

ఎండల తీవ్రతతోనే ఆలస్యం..

ఎండలు బాగా ఉంటుండడంతో మిల్లుల్లో హమాలీలు ఉదయం, సాయంత్రం లారీలు అన్‌లోడ్ చేస్తున్నారు. దీంతో అన్‌లోడ్ కొంత ఆలస్యం అవుతుంది. ఎలాంటి తరుగు, కోతల కోసం మిల్లర్లు తిరకాసు పెట్టడం లేదు. కొనుగోలు తూకం వేసిన ధాన్యం బస్తాలు కవర్లు కప్పి ఉంచాలని నిర్వాహకులకు సూచిస్తున్నాం.

– శ్రీకళ, జిల్లా పౌరసరఫరాలశాఖ మేనేజర్

వైద్యుల గైర్హాజరుకు చెక్

- నేటి నుంచి ముఖ ఆధారిత గుర్తింపుతోనే హాజరు
- వైద్య కళాశాల, అనుబంధ ఆస్పత్రుల్లో అమలు
- ఎన్ఎంసీ ఆదేశాలతో బయోమెట్రిక్‌కు స్వస్తి



మంచిర్యాల ప్రభుత్వ మెడికల్ కాలేజీ

మంచిర్యాలటౌన్: ప్రభుత్వ, ప్రైవేటు వైద్య కళాశాలలు, ప్రభుత్వ ఆస్పత్రుల్లో వైద్యసిబ్బంది గైర్హాజరుకు చెక్ పడనుంది. నేటి నుంచి ముఖ ఆధారిత గుర్తింపు(ఫేస్ బేస్‌డ్ ఆధార్ అథెంటికేషన్) హాజరు అమలుకు జాతీయ వైద్య మండలి(ఎన్ఎంసీ) చర్యలు చేపట్టింది. మంచిర్యాల వైద్య కళాశాలతోపాటు అనుబంధంగా కొనసాగుతున్న ప్రభుత్వ జనరల్ ఆస్పత్రి, మాతాశిశు ఆరోగ్య కేంద్రంలోని వైద్యులు, బోధకులు, సహాయ బోధకులు, అసోసియేట్లు అందరూ తప్పనిసరిగా ఫేస్ రికగ్నేషన్ విధానంతోనే హాజరు వేసుకోవాల్సి ఉంటుంది. ఇందుకోసం వైద్య కళాశాలలోని అడ్మినిస్ట్రేటివ్ బ్లాక్, ప్రభుత్వ జనరల్ ఆస్పత్రి, మాతాశిశు ఆరోగ్య కేంద్రం కారిడార్ల వివరాలను ఆన్‌లైన్‌లో నమోదు చేశారు. ఆయా ప్రాంతాల అక్షాంశాలు, రేఖాంశాల ఆధారంగా నమోదు చేసిన వీటి పరిధిలోని వంద మీటర్ల లోపు ఉండి ముఖ ఆధారిత గుర్తింపు ద్వారా హాజరు నమోదు చేస్తేనే హాజరు పడనుంది. ఫేస్‌బేస్‌డ్ ఆధార్ అథెంటికేషన్‌కు సంబంధించిన మూడు యంత్రాలు ఎన్ఎంసీ నుంచి రావాల్సి ఉండగా.. ప్రస్తుతం మొబైల్ ఫోన్‌లోనే యాప్ ద్వారా హాజరు నమోదు చేసుకోనున్నారు. గత వారం రోజులుగా ప్రయోగాత్మకంగా అమలు చేస్తున్నారు. ఇప్పటివరకు బయోమెట్రిక్ ద్వారా హాజరు నమోదు చేస్తున్నారు. ఈ విధానంతో కొందరు ఇష్టారీతిగా హాజరు నమోదు చేస్తున్నారనే ఆరోపణలున్నాయి. కొందరు హైదరాబాద్, వరంగల్, కరీంనగర్ తదితర ప్రాంతాల నుంచి రాకపోకలు సాగిస్తుండడంతో సమయపాలన పాటించడం లేదు. వారి సేవలు పూర్తి స్థాయిలో అందడం లేదు. కొత్త విధానంతో బయోమెట్రిక్‌కు స్వస్తి పలుకుతోంది.

కొత్త విధానం అమలు



మే ఒకటి నుంచి ప్రభుత్వ మెడికల్ కాలేజీ, ప్రభుత్వ జనరల్ ఆసుపత్రి, మాతాశిశు ఆరోగ్య కేంద్రంలో వైద్యులు, బోధన వైద్యులు హాజరు ఇకపై కొత్త విధానంలోనే తీసుకోవడం జరుగుతుంది. కచ్చితమైన హాజరు కోసం ఎంసీహెచ్, జీజీహెచ్, మెడికల్ కాలేజీకి మూడు మిషన్లు ఎన్ఎంసీ నుంచి రావాల్సి ఉంది. అప్పటివరకు మొబైల్ యాప్‌ను వినియోగించి హాజరు నమోదు చేసుకోవడం జరుగుతుంది.

– ఎండి.సులేమాన్, మంచిర్యాల ప్రభుత్వ కళాశాల ప్రిన్సిపాల్

3న మంచిర్యాల బంద్

మంచిర్యాలటౌన్: జమ్మూకశ్మీర్‌లో హిందువులపై ఉగ్రవాదుల దాడులను నిరసిస్తూ ఈ నెల 3న మంచిర్యాల పట్టణ బంద్ నిర్వహించనున్నట్లు హిందూ సంఘాల ఐక్యవేదిక సభ్యులు తెలిపారు. బుధవారం జిల్లా కేంద్రంలో సమావేశం అయ్యారు. పట్టణ బంద్‌తోపాటు ర్యాలీ నిర్వహిస్తామని, అన్ని సంఘాలు, ప్రజలు పాల్గొని విజయవంతం చేయాలని కోరారు. ఈ సమావేశంలో ఆర్‌ఎస్‌ఎస్ నగర కార్యవాహ పర్వతాల నర్సయ్య, సహ కార్యవహ బాపూజీ, హిందూ సంఘాల ఐక్యవేదిక అధ్యక్షుడు డేగ రవీందర్, కార్యదర్శి కర్ణకంటి రవీందర్ పాల్గొన్నారు.

పెండింగ్ కేసులపై ప్రత్యేక దృష్టి

మంచిర్యాలక్రైం: కమిషనరేట్ పరిధి మంచిర్యాల, పెద్దపల్లి జిల్లాల్లోని పెండింగ్ కేసులపై ప్రత్యేక దృష్టి సారించాలని రామగుండం పోలీస్ కమిషనర్ అంబర్ కిషోర్ ఝా అన్నారు. బుధవారం కమిషనరేట్ ఆవరణలోని సమావేశ మందిరంలో పోలీస్ అధికారులతో నేర సమీక్ష సమావేశం నిర్వహించారు. రికార్డులు పరిశీలించి పెండింగ్ కేసుల వివరాలు, వాటి ప్రస్తుత పరిస్థితిపై అడిగి తెలుసుకున్నారు. ఈ సమావేశంలో డీసీపీలు ఎగ్గడి భాస్కర్, కరుణాకర్, అడిషనల్ డీసీపీ రాజు, ఎస్‌బీ ఏసీపీ రాఘవేంద్రరావు, ఏసీపీలు ప్రకాష్, వెంకటేశ్వర్లు, రవికుమార్, నర్సింహులు, మల్లారెడ్డి, ప్రతాప్, సీఐలు, ఎస్సైలు పాల్గొన్నారు.

నలుగురికి ఎస్సైగా పదోన్నతి

మంచిర్యాలక్రైం: కమిషనరేట్ పరిధిలో ఏఎస్సైలుగా పని చేస్తున్న సయ్యద్ మజారొద్దీన్, అబ్దుల్ మున్నీర్ అహ్మద్, ఎం.రాజన్న, ఆర్.బిక్‌లాల్‌కు ఎస్సైగా పదోన్నతి లభించింది. వీరికి సీపీ తన చాంబర్‌లో చిహ్నాలను అలంకరించారు.



మాట్లాడుతున్న సీపీ అంబర్ కిషోర్ ఝా

మంచిర్యాలక్రైం: ఉద్యోగ విరమణ పొందిన సీఐ డీ.కమలాకర్, ఏఆర్ఎస్సై ఎం.నర్సయ్య, సీనియర్ అసిస్టెంట్ ఎస్.సుందర్‌లను సీపీ అంబర్ కిషోర్ ఝా బుధవారం ఘనంగా సన్మానించారు. వారి సేవలను కొనియాడారు. పోలీస్ అధికారుల సంఘం అధ్యక్షుడు బొర్లకుంట పోచలింగం, సిబ్బంది పాల్గొన్నారు.

క్లుప్తంగా

మతిస్థిమితం లేక యువకుడి ఆత్మహత్య

కుభీర్: మండలంలోని హంపోలి గ్రామానికి చెందిన శెరె శ్రీకాంత్ (35) మతిస్థిమితం లేక ఉరేసుకుని ఆత్మహత్యకు పాల్పడినట్లు ఎస్సై పి.రవీందర్ తెలిపారు. ఆయన కథనం ప్రకారం.. శ్రీకాంత్ గత కొంతకాలంగా మతిస్థిమితం కోల్పోయి తిరుగుతుండేవాడు. ఈక్రమంలో బుధవారం ఉదయం సమయంలో ఇంట్లో ఫ్యాన్‌కు ఉరేసుకున్నాడు. మృతుడి సోదరుడు దిలీప్ ఫిర్యాదుతోకేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై తెలిపారు.

లైంగికదాడికి యత్నించిన కేసులో వ్యక్తికి రెండేళ్ల జైలు

తానూరు: లైంగికదాడికి యత్నించిన కేసులో వ్యక్తికి రెండేళ్ల జైలు శిక్షతోపాటు రూ. వెయ్యి జరిమానా విధిస్తూ భైంసా మేజిస్ట్రేట్ దేవేందర్‌బాబు బుధవారం తీర్పునిచ్చారు. ట్రెయినీ ఎస్సై నవనీత్‌రెడ్డి కథనం ప్రకారం..మండలంలోని వడ్గాం గ్రామానికి చెందిన దిలీప్ 2020 జనవరి 26న అదేగ్రామానికి చెందిన మహిళ ఇంటికి వెళ్లి లైంగిక దాడికి యత్నించాడు. బాధిత మహిళ పోలీస్ స్టేషన్‌లో ఫిర్యాదు చేయగా అప్పటి ఎస్సై రాజన్న కేసు దర్యాప్తు చేశారు. కోర్టులో నిందితుడు నేరం రుజువు చేయడంతో మేజిస్ట్రేట్ ఈమేరకు తీర్పునిచ్చారని ట్రెయినీ ఎస్సై వెల్లడించారు.

గూడెంలో భక్తుల సందడి



సత్యదేవుణ్ని దర్శించుకుంటున్న భక్తులు

దండేపల్లి: అక్షయ తృతీయ సందర్భంగా గూడెం శ్రీసత్యనారాయణస్వామి ఆలయంలో బుధవారం భక్తుల సందడి నెలకొంది. భక్తులు అధిక సంఖ్యలో వచ్చి సత్యదేవున్ని దర్శించుకున్నారు. పలువురు భక్తులు సామూహిక సత్యనారాయణస్వామి వ్రతాలు నోముకున్నారు. గుట్టపై గల శ్రీఆంజనేయస్వామి ఆలయంలో 484 మంది భక్తులు హనుమాన్ దీక్ష మాలాధారణ చేసుకున్నారు.

డ్రంకెన్ డ్రైవ్‌లో పట్టుబడిన వారికి శిక్షలు

మంచిర్యాలక్రైం: డ్రంకెన్ డ్రైవ్‌లో పట్టుబడిన వారికి సెకండ్ అడిషనల్ జ్యుడీషియల్ ఫస్ట్ క్లాస్ మేజిస్ట్రేట్ న్యాయమూర్తి కె.నిరోష బుధవారం వినూత్న శిక్షలు విధించింది. జిల్లా కేంద్రంలో ట్రాఫిక్ సీఐ సత్యనారాయణ ఆధ్వర్యంలో డ్రంకెన్ డ్రైవ్‌లో భాగంగా పట్టుబడిన వారిపై కేసులు నమోదు చేసి కోర్టులో హాజరుపర్చారు. ఐదుగురికి ఈనెల 2 నుంచి 5వ తేదీ వరకు ప్రభుత్వ ఆసుపత్రిని శుభ్రపర్చాల్సిందిగా, మరో 7గురికి రూ.16 వేల జరిమానా విధిస్తూ న్యాయమూర్తి శిక్ష ఖరారు చేసినట్లు ట్రాఫిక్ సీఐ తెలిపారు.

గాదిగూడ తహసీల్దార్ బదిలీ.. ఉద్యోగ విరమణ

కైలాస్‌నగర్: ఆదిలాబాద్ జిల్లా గాదిగూడ తహసీల్దార్ ఎస్.విజయానందం మంచిర్యాల జిల్లాకు బదిలీ అయ్యారు. ఈ మేరకు సీసీఎల్ ఏ కమిషనర్ నవీన్ మిత్తల్ మంగళవారం ఉత్తర్వులు జారీచేశారు. ఆయన సొంత జిల్లాలో రిపోర్ట్ చేసి బుధవారం ఉద్యోగ విరమణ పొందారు. కాగా, విజయానందం స్థానంలో డీటీగా పనిచేస్తున్న చౌహాన్ విలాస్‌కు తహసీల్దార్‌గా బాధ్యతలు అప్పగిస్తూ కలెక్టర్ రాజర్షిషా ఉత్తర్వులు జారీ చేశారు.

విత్తనపూజకు వేళాయె

- జంగుబాయి సన్నిధిలో ఆదివాసీల పూజలు
- ఆలయంలో రేపటి నుంచి నెలరోజులు ఉత్సవాలు



జంగుబాయి కొలువైంది ఇదే గుహలో



ఆలయంలో కొలువైన పోచమ్మ తల్లులు

కెరమెరి(ఆసిఫాబాద్): అనాదిగా వస్తున్న ఆచారాలు, సంస్కృతి, సంప్రదాయాలను కాపాడడంలో ఆదివాసీలు ముందుంటున్నారు. జూన్ 8న మృగశిరకార్తె ప్రవేశించనుండడంతో ఆదివాసీలు తెలంగాణ–మహారాష్ట్ర సరిహద్దులోని మహరాజ్‌గూడ అడవుల్లో కొలువైన జంగుబాయికి పుణ్యక్షేత్రంలో విత్తన పూజకు శ్రీకారం చుట్టారు. అక్కడి గుహలోకి వెళ్లి దీపం వద్ద పూజలు చేస్తారు. రావుడ్, పోచమ్మ, మైసమ్మకు విత్తనాలు చూపించి మొక్కి అమ్మవార్లకు నైవేద్యం చూపిస్తారు. విత్తన పూజల అనంతరం తమ పొలాల్లో విత్తనాలు నాటడం ప్రారంభిస్తారు. దీన్ని గోండి భాషలో 'మొహతుక్'అంటారు. అదేవిధంగా గిరి గ్రామాల్లో ఏటా జరిగే విత్తన పూజల ముందుగా జంగుబాయి అమ్మవారికి విత్తనాలు చూపెట్టాక పొలాల్లో నాటడంతో అధిక దిగుబడి వస్తాయని భక్తుల నమ్మకం.

నేడు దీపోత్సవం

జంగుబాయి సన్నిధిలో గురువారం దీపోత్సవం, శుక్రవారం నుంచి ప్రారంభమయ్యే ఉత్సవాలు నెల రోజుల పాటు నిర్వహిస్తారు. వివిధ గ్రామాలకు చెందిన మెాశంలు తరలివచ్చి పూజలు చేస్తాయి. దుక్కిలతో దున్ని విత్తనాలు వేసేందుకు తమ పొలాలను రైతులు సిద్ధం చేశారు. ఉమ్మడి జిల్లాలో ఆదిలాబాద్, కుమురం భీం జిల్లాలోనే ఆదివాసీలు అధికంగా ఉన్నారు.

దేవతలకు విత్తనాలను చూపిస్తారు

మే మాసంలో అన్ని గ్రామాల్లో గ్రామ పటేల్ ఇంట్లో ప్రత్యేక సమావేశం ఏర్పాటు చేస్తారు. ఆదివాసీల కులదైవమైన పాటేరు అమ్మోరు, జంగుబాయి, గాంధారి కిల్ల, పద్మాల్‌పురి కాకో వద్దకు వెళ్లి విత్తనాలను చూపిస్తారు. అక్కడే దేవతల ఆశీర్వాదం తీసుకుని తిరుగుపయనమవుతారు. అనంతరం



రాహుడ్ దేవతలు

గ్రామంలో ఉన్న ఆకిపేన్, అమ్మోరు, పోచమ్మ వద్దకు వెళ్లి విత్తనాలతో పూజలు చేస్తారు. అదే రోజు రాత్రి 2.5 కిలోల జొన్నలతో గట్కా తయారు చేసి ఆరగిస్తారు. అర్ధరాత్రి అడవికి వెళ్లి (కుమ్ముడ్) చెట్టు ఆకులను తీసుకువచ్చి డొప్పలు తయారు చేసి ఇళ్లల్లో ఇస్తారు. అందులో పూజ చేసిన విత్తనాలు వేస్తారు. ఈ కార్యక్రమంతా మృగశిర మాసానికి కొద్ది రోజుల ముందుగా నిర్వహిస్తారు.

విత్తన పూజలు(మొహతుక్)

విత్తన పూజ చేయాలన్న రోజు రైతు కుటుంబమంతా ఉదయాన్నే పొలం బాట పడుతారు. ఉదయం ఇంటిని శుభ్రం చేసి పేడతో అలుకు చల్లుతారు. పొలానికి వెళ్లాక జొన్నతో గట్కా తయారు చేసి కుల దైవంతోపాటు నేల తల్లికి సమర్పిస్తారు. అనంతరం పొలంలో విత్తనాలు చల్లి అరకకు ప్రత్యేక పూజలు చేసి విత్తనాలు నాటుతారు. గ్రామ పటేల్ ఇంటి ఎదుట మహిళలు సంప్రదాయ నృత్యాలు చేస్తారు. పురుషులు గిల్లిదండా ఆట ఆడుతారు. తర్వాత సహపంక్తి భోజనం చేస్తారు.

చంచి భీమల్ దేవుడి కల్యాణంతో..

ఆదివాసీల ఇష్టదైవమైన చంచి భీమల్ దేవుడి కల్యాణం సందర్భంగా ఏటా ఏప్రిల్, మే మాసంలో విత్తనాలను దేవుడికి చూపిస్తారు. ఆరోజు ఆదివాసీలు భీమల్ దేవుడికి సంప్రదాయ పూజలు చేస్తారు. అడవుల్లో లభించే ఆకులతో ఆరు డొప్పలను తయారు చేస్తారు. అందులో అన్ని విత్తనాలను కలిపి భీమల్ దేవునికి చూపిస్తారు. అనంతరం వాటిని ఇళ్లకు తీసుకెళ్లి దాచి పెడ్తారు. ఆరోజు పిండి వంటలు చేసి ఆరగిస్తారు. మృగశిర కార్తె ప్రారంభంతో ఆ విత్తనాలను తమ పొలాల్లో చల్లుతారని పలువురు చెబుతున్నారు.

దేవతలకు చూపించాకే..



పొలాల్లో విత్తనాలు నాటే కొన్నిరోజుల ముందు కుల దేవతలకు వాటిని చూపిస్తాం. ప్రత్యేక పూజలు చేశాకే పొలానికి వెళ్లి జొన్నగట్కాను వండి ఆరగిస్తాం. నేలతల్లికి ప్రత్యేక పూజలు చేసి విత్తనాలు నాటడం ప్రారంభిస్తాం. – సలాం శ్యాంరావు, జంగుబాయి ఉత్సవ కమిటీ చైర్మన్

ఆచారాలు పాటిస్తున్నాం



ఆదివాసీలు ఆచారాలు, సంప్రదాయాలు పాటిస్తూ వస్తున్నారు. ఏళ్ల క్రితం నుంచి ప్రారంభమైన విత్తన(మొహతుక్) పూజలు ఇప్పుడు కూడా చేస్తున్నాం. పూజలు చేయందే విత్తనాలు నాటం.– పుర్క బాపూరావు, జంగుబాయి ఉత్సవ కమిటీ, ప్రచార కార్యదర్శి

ఉమెన్స్ హ్యాండ్‌బాల్ విజేత ఉమ్మడి ఆదిలాబాద్




కప్ అందుకుంటున్న ఉమ్మడి ఆదిలాబాద్ జట్టు

- రన్నరప్‌గా రంగారెడ్డి జట్టు

మందమర్రిరూరల్: మందమర్రి ఏరియాలోని సింగరేణి హైస్కూల్ మైదానంలో మూడు రోజులు జరిగిన రాష్ట్రస్థాయి 54వ సీనియర్ మహిళల తెలంగాణ హ్యాండ్‌బాల్ పోటీల్లో ఉమ్మడి ఆదిలాబాద్ జట్టు విజేతగా, రంగారెడ్డి జట్టు రన్నరప్‌గా నిలిచింది. బుధవారం ఫైనల్‌మ్యాచ్‌లో ఈ జట్లు తలపడగా ఆదిలాబాద్ జట్టు 13, రంగారెడ్డి జిల్లా జట్టు 11 గోల్స్ వేసింది. మూడో స్థానంలో వరంగల్, నాలుగో స్థానంలో ఖమ్మం జట్లు నిలిచాయని, గెలిచిన జట్లకు నిర్వాహకులు షీల్డులు ప్రదానం చేశారు. ఈ సందర్భంగా హ్యాండ్‌బాల్ అసోసియేషన్ ఉమ్మడి జిల్లా ప్రధాన కార్యదర్శి కనపర్తి రమేశ్ మాట్లాడుతూ రాష్ట్రస్థాయి జట్టు కోసం 20 మందిని ఎంపిక చేసి వరంగల్‌లో కోచింగ్ ఇస్తామన్నారు. గుజరాత్‌లోని బూజ్‌లో ఈనెల 21 నుంచి 27 వరకు నిర్వహించే జాతీయస్థాయి పోటీల్లో రాష్ట్ర జట్టు పాల్గొంటుందన్నారు. ఈ పోటీల్లో తెలంగాణ ఉమ్మడి 10 రాష్ట్రాల నుంచి 200 మంది క్రీడాకారులు పాల్గొన్నారు. కార్యక్రమంలో అసోసియేషన్ రాష్ట్ర కార్యదర్శి పవన్‌కుమార్, టోర్నమెంట్ ఆర్గనైజర్ కాంపెల్లి సమ్మయ్య, కోశాధికారి రమేశ్‌రెడ్డి, గ్రౌండ్ ఇన్‌చార్జి నస్పూరి తిరుపతి పాల్గొన్నారు.

గుండెపోటుతో ట్రెయినీ సీఆర్పీఎఫ్ కానిస్టేబుల్ మృతి



రామళ్ల సాగర్ (ఫైల్)

భీమారం: మండల కేంద్రానికి చెందిన రామళ్ల సాగర్ ట్రెయినీ సీఆర్పీఎఫ్ కానిస్టేబుల్ గుండెపోటుతో మృతిచెందాడు. అతని బంధువులు తెలిపిన వివరాలు.. కొన్నినెలల క్రితం సీఆర్పీఎఫ్ కానిస్టేబుల్‌గా ఎంపికైన సాగర్ (29) ఆంధ్రప్రదేశ్ రాష్ట్రం అనంతపురంలో శిక్షణ పొందుతున్నాడు. శిక్షణలో భాగంగా కాలికి దెబ్బతగలంతో వైద్యులు విశ్రాంతి తీసుకోవాలనడంతో గతనెల 26న స్వగ్రామానికి వచ్చాడు. బంధువుల వివాహం ఉండటంతో కుటుంబ సభ్యులు, స్నేహితులతో కలసి బుధవారం మంచిర్యాలకు వెళ్లాడు. అక్కడ ఒక హోటల్ వద్ద కూర్చున్న సాగర్ అకస్మాత్తుగా కిందపడిపోయాడు. వెంటనే గమనించి అంబులెన్స్‌లో ఆస్పత్రికి తరలించారు. అప్పటికే మృతిచెందాడని వైద్యులు నిర్ధారించారు. సాగర్ మృతితో భీమారంలో విషాదఛాయలు అలుముకున్నాయి.

గుండెపోటుతో సింగరేణి కార్మికుడు మృతి

బెల్లంపల్లి: బెల్లంపల్లి రడగంబాల బస్తీకి చెందిన మారెపల్లి రవీందర్ రెడ్డి (56) శాంతిఖని సింగరేణి కార్మికుడు గుండెపోటుతో మృతిచెందాడు. టూటౌన్ ఎస్సై కె.మహేందర్ కథనం ప్రకారం ..భార్య, పిల్లలు ఊరికి వెళ్లడంతో ఇంట్లో ఒంటరిగా ఉన్న రవీందర్ రెడ్డి మంగళవారం రాత్రి భోజనం చేస్తూ కుర్చీలో కుప్పకూలిపోయాడు. బుధవారం ఆన్‌లైన్‌లో ఆర్డర్ చేసిన పార్సిల్ రావడంతో విషయాన్ని భర్తకు చెప్పడానికి భార్య మంజు పలుమార్లు ఫోన్ చేసింది. లిఫ్ట్ చేయకపోవడంతో సహచర కార్మికుడికి ఫోన్ చేసి ఓసారి ఇంటికి వెళ్లి చూడాలంది. అతను వెళ్లి ఇంటి కిటికీ నుంచి చూడగా కుర్చీలో రవీందర్ రెడ్డి బిగుసుకుపోయి ఉన్నట్లు గుర్తించాడు. చుట్టుపక్క ఇళ్ల వారిని పిలిచి తలుపు పగులగొట్టి చూసేసరికి మృతి చెంది ఉన్నాడు. పోలీసులు, కుటుంబ సభ్యులకు ఆయన సమాచారం అందించారు. భార్య ఫిర్యాదుతో కేసు దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై తెలిపారు. మృతుడికి కూతురు, కుమారుడు ఉన్నారు.

వడగళ్ల వానకు అతలాకుతలం

- తడిసిన ధాన్యం, విరిగిన స్తంభాలు
- నేలరాలిన మామిడి



గుండ్లసోమారంలో ఇంటిపై నుంచి లేచిపోయిన రేకులు

నెన్నెల/భీమారం/మంచిర్యాలఅగ్రికల్చర్/జైపూర్: నెన్నెల మండలం గుండ్లసోమారం, చిత్తాపూర్, ఆవుడం, జెండావెంకటాపూర్, మైలారం, గొల్లపల్లి, కొత్తూర్, గంగారాం గ్రామాల్లో బుధవారం సాయంత్రం వడగళ్లతో కూడిన గాలివాన కురిసింది. ధాన్యం కుప్పలు తడిసిపోగా కోతకు వచ్చిన వడ్లు, మామిడికాయలు నేలరాలిపోయాయి. గుండ్లసోమారంలో రెండు విద్యుత్ స్తంభాలు, నాలుగు రేకుల షెడ్లు కూలిపోయాయి. నెన్నెల హన్మాన్ మందిర్ వద్ద విద్యుత్‌వైర్ తెగిపోవడంతో మూడు గంటలపాటు విద్యుత్ సరఫరా నిలిచిపోయింది. భీమారం మండలంలో వడగళ్ల వానకు మామిడి తోటలకు నష్టం వాటిల్లింది. దాంపూర్ గ్రామంలో ఇళ్లపై రేకులు కొట్టుకుపోయాయి. మంచిర్యాలలో తేలికపాటి వర్షం కురిసింది. జైపూర్ మండలం పొనూర్ గ్రామానికి చెందిన ఐటిపాముల మల్లేశ్ ఇంటి రేకులు గాలికి ఎగిరిపోయి ఇల్లు కూలింది. శివ్వారంలో పెద్దపల్లి నర్సయ్య ఇల్లు ధ్వంసమైంది. కరెంట్ స్తంభాలు విరిగిపడ్డాయి. చెట్లు నేలకొరిగాయి. ఈదురు గాలులతో కాత దశకు చేరిన మామిడి కాయలు నేలరాలిపోయాయి.

ఆటోడ్రైవర్లకు ఇచ్చిన హామీలు అమలుచేయాలి



నినాదాలు చేస్తున్న ఆటోడ్రైవర్లు

బెల్లంపల్లి: అసెంబ్లీ ఎన్నికల్లో ఆటోడ్రైవర్లకు ఇచ్చిన హామీలను ప్రభుత్వం వెంటనే అమలు చేయాలని ఆటోజేఏసీ రాష్ట్ర అధ్యక్షుడు మంద రవికుమార్ డిమాండ్ చేశారు. గతనెల 25న మెదక్ జిల్లా నర్సాపూర్‌లో ప్రారంభించిన ఆటో రథయాత్ర బుధవారం బెల్లంపల్లికి చేరుకుంది. ఈ సందర్భంగా ఆటోడ్రైవర్స్ యూనియన్ అధ్యక్షుడు కట్టా రాంకుమార్, నాయకులు, ఆటోడ్రైవర్లు రథయాత్రకు స్వాగతం పలికారు. బజారుఏరియా పురవీధుల మీదుగా రథయాత్ర, ఆటోలతో ర్యాలీ చేశారు. రథయాత్ర మే 27న హైదరాబాద్‌కు చేరుకుంటుందని, ఈసందర్భంగా ఇందిరాపార్కులో నిర్వహించే ఆటో ఆకలికేకలు మహాసభకు ఆటోడ్రైవర్లు తరలిరావాలని కోరారు.

గేదెల మృతి కారకుడికి 9 నెలల జైలు

ఆసిఫాబాద్: విద్యుత్ తీగలు అమర్చి, నాలుగు గేదెల మృతికి కారణమైన తిర్యాణి మండలం చెలిమెల కొలాంగూడకు చెందిన టేకం కొండుకు 9 నెలల జైలుశిక్ష విధిస్తూ జిల్లా సెషన్స్ కోర్టు ప్రధాన న్యాయమూర్తి ఎంవీ రమేశ్ బుధవారం తీర్పుచెప్పారు. తిర్యాణి ఎస్సై శ్రీకాంత్ కథనం ప్రకారం.. తిర్యాణి నుంచి మాణిక్యాపూర్ వెళ్లే మార్గంలో గుట్టమేడి అటవీ ప్రాంతంలో జంతువులకోసం టేకం కొండు విద్యుత్ తీగలు అమర్చాడు. భీమ్‌రావు, భుజంగరావు, సోంబాయి, విజయలకు చెందిన నాలుగు గేదెలు 2017 మే 31న మేత కు వెళ్లి తిరిగి రాలేదు. ఈక్రమంలో అటవీప్రాంతంలో గాలించగా మృతిచెంది ఉన్నాయి. బాధితుల ఫిర్యాదుతో అ ప్పటిఎస్సై బుద్దేస్వామి కేసు నమోదు చేశారు. రెబ్బెన సీఐ బుద్దేస్వామి, తిర్యాణి ఎస్సై శ్రీకాంత్ కోర్టులో సాక్షులు ప్రవేశపెట్టగా పీపీ జనన్మోహన్‌రావు విచారించి నేరం రుజువుచేశారు. ఈ మేరకు న్యాయమూర్తి తీర్పుచెప్పారు. నిందితుడికి శిక్షపడేలా కృషిచేసిన కోర్టు లైజనింగ్ అధికారి రాంసింగ్, కానిస్టేబుల్ వినోద్‌ను ఎస్పీ శ్రీనివాసరావు అభినందించారు.

మంచిర్యాల సీఈగా సత్య రాజచంద్ర

కైలాస్‌నగర్: ఉమ్మడి ఆదిలాబాద్ జిల్లా ఇరిగేషన్ శాఖలో ఇద్దరు అధికారులకు ఇన్‌చార్జీలుగా అదనపు బాధ్యతలు అప్పగించారు. ఉద్యోగ విరమణ చేసి వివిధ పోస్టుల్లో పనిచేస్తున్న వారిని రాష్ట్ర ప్రభుత్వం తొలగించిన విషయం తెలిసిందే. ఖాళీగా ఉన్న స్థానాల్లో ఇన్‌చార్జిలకు బాధ్యతలు అప్పగించారు. పెద్దపల్లి జిల్లా ఎస్ఈగా పనిచేస్తున్న ఎ.సత్య రాజచంద్రను మంచిర్యాల చీఫ్ ఇంజినీర్‌గా నియమించారు. ఆదిలాబాద్ ఇరిగేషన్ సర్కిల్‌లో డిప్యూటీ సూపరింటెండెంట్‌గా పనిచేస్తున్న ఎం.లక్ష్మిని నిర్మల్ సర్కిల్ డీఈగా బాధ్యతలు అప్పగించారు. ఈ ఉత్తర్వులు తక్షణమే అమలులోకి వస్తాయని ఇరిగేషన్ శాఖ ప్రభుత్వ ప్రిన్సిపల్ సెక్రెటరీ రాహుల్ బొజ్జ పేర్కొన్నారు.

తాత్విక ధోరణితో సమున్నత జీవితం

- 'జీవితమే ఒకపుస్తకం'గ్రంథ పరిచయ కార్యక్రమంలో సాహితీవేత్తలు
- జిడ్డు కృష్ణమూర్తి ఆంగ్లపుస్తకాన్ని అనువదించిన జిల్లాకవి



ఆవిష్కరిస్తున్న సాహితీవేత్తలు

నిర్మల్‌ఖిల్లా: తాత్విక ధోరణి ద్వారానే సమున్నత జీవితం సిద్ధిస్తుందని జిల్లాకు చెందిన పలువురు సాహితీవేత్తలు అభిప్రాయపడ్డారు. జిల్లాకేంద్రంలోని కావేరి ఫౌండేషన్ గ్రంథాలయంలో మంగళవారం రాత్రి 'జీవితమే ఒక పుస్తకం'గ్రంథ పరిచయ కార్యక్రమాన్ని నిర్వహించారు. జిల్లాకు చెందిన ప్రభుత్వ ఉపాధ్యాయుడు, అనువాదకర్త కె.మచ్చేందర్..ప్రపంచ తాత్వికవేత్త జిడ్డు కృష్ణమూర్తి ప్రసంగాల సమాహార గ్రంథం 'ది బుక్ ఆఫ్ లైఫ్'అనే ఆంగ్ల పుస్తకాన్ని తెలుగులోకి అనువదించారు. కార్యక్రమంలో పాల్గొన్న సాహితీవేత్తలు మాట్లాడుతూ రెండున్నరేళ్ల పాటు కష్టపడి ఈ గ్రంథాన్ని తెలుగులోకి అనువదించడం ప్రశంసనీయమని కొనియాడారు. కావేరి ఫౌండేషన్ చైర్మన్ అప్పాల చక్రధారి, సాహితీవేత్తలు టి.సంపత్ కుమార్, నరసయ్య, రవీంద్రబాబు, తుమ్మల దేవరావు, కృష్ణంరాజు, మునిమడుగుల రాజారావు, ఆకుల సుదర్శన్, అంబటి నారాయణ, అనిత, నాగరంజని, నూకల విజయ్‌కుమార్, దీపక్, పోలీస్ భీమేశ్ తదితరులు పాల్గొన్నారు.

ఆనాటి చరిత్ర కాలగర్భంలోకి..



దేవతమూర్తుల విగ్రహాలు



నాటి రాతి స్తంభాలు

కడెం:మండలంలోని బెల్లాల్ సమీపంలో గోదావరి, కడెం నది కలిసే ప్రాంతంలో 1200 ఏళ్ల క్రితం నాటి మల్లికార్జున స్వామి ఆలయ చరిత్ర కాలగర్భంలోకి కలిసిపోతుంది. ఆలయ గర్భంలో నిధులు, నిక్షేపాలు ఉన్నాయని వందల ఏళ్ల క్రితం ఆలయాన్ని, దేవతమూర్తుల విగ్రహాలను నాడు కొందరు ధ్వంసం చేశారు. ఈ క్రమంలో స్తంభాలు పడి ఓ వ్యక్తి మృతిచెందినట్లు పెద్దలు చెబుతున్నారు. పురాతన ఆలయాన్ని పరిరక్షించకపోవడంతో అనాటి చరిత్రాక ఆనవాళ్లు కనుమరుగవుతున్నాయి. విగ్రహాల తల భాగాలు లేకుండా పోగా, రాతిస్తంభాలు గోదావరి ఒడ్డున కుప్పలుగా ఉన్నాయి. ప్రస్తుతం పురాతన ఆలయం ఉన్నచోట గ్రామానికి చెందిన వారు నూతన ఆలయ నిర్మాణం చేపడుతున్నారు. 1200 ఏళ్ల క్రితం నాటి చరిత్రని, శివ సాహిత్యం పొందడానికి ఆత్మాహుతి చేసుకున్న వీరగల్లు విగ్రహంగా భావిస్తున్నట్లు తెలంగాణ చరిత్రబృందం కన్వీనర్ శ్రీరామోజు హరగోపాల్, రాజ్‌కుమార్ తెలిపారు.

అక్రమ కలప తరలిస్తున్న వ్యక్తికి రిమాండ్

ఆసిఫాబాద్‌అర్బన్/తిర్యాణి: అక్రమ కలపను తరలిస్తున్న వ్యక్తికి 14 రోజుల రిమాండ్ విధిస్తూ ఆసిఫాబాద్ జిల్లా జడ్జి ఎంవి. రమేశ్ బుధవారం ఉత్తర్వులు జారీచేశారు. తిర్యాణి రేంజ్ అధికారి శ్రీనివాస్ కథనం ప్రకారం.. మండలంలోని కోసర నుంచి ఆసిఫాబాద్ మీదుగా మంచిర్యాల జిల్లా ఐబీ తాండూర్‌కు ఈనెల 28న అక్రమంగా కారులో టేకు కలపను తరలిస్తున్నట్లు సమాచారం అందింది. అటవీ అధికారులు ఆసిఫాబాద్ నుంచి కారును వెంబడించి తాండూర్ వద్ద పట్టుకున్నారు. కారులో 17 దుంగలు లభ్యం కాగా, వీటి విలువ రూ. 46,665 ఉంటుందన్నారు. ఐబి తాండూర్‌కు చెందిన ఏలేశ్వరం తిరుపతిని అదుపులో తీసుకుని విచారించగా తనకు ఐబీలో వైభవ్ టింబర్ డిపో ఉందని తెలిపాడు. తరచూ కోసరా గ్రామానికి చెందిన అజ్మీర గణపతి వద్ద అక్రమ టేకు కలపను తరలిస్తానని ఒప్పుకున్నాడు. అతన్ని కోర్టులో హాజరుపర్చగా ఈ మేరకు జడ్జి రిమాండ్ విధించారు. అయితే అజ్మీర గణపతి పరారీలో ఉన్నట్లు తెలిపారు. డిప్యూటీ రేంజ్ అధికారి ఇక్బాల్ మోహినొద్దీన్, సెక్షన్ అధికారులు విజయప్రకాశ్, మహేందర్, బీట్ అధికారులు అనిల్, ప్రకాశ్, శ్రీకాంత్, సాధిక్ పాల్గొన్నారు.

నకిలీపత్రాల ఘటనపై ఎస్పీ సీరియస్

- ఉద్యోగాలు పొందిన 17 మంది..
- విచారణ అధికారిగా ఉట్నూర్ ఏఎస్పీ కాజల్‌సింగ్
- కొనసాగుతున్న విచారణ

ఇచ్చోడ: ఆదిలాబాద్ జిల్లాలో నకిలీ నివాస ధ్రువీకరణ పత్రాలు సృష్టించి ఏకంగా 17 మంది ఉద్యోగాలు సాధించిన సంఘటన జిల్లాలో కలకలం రేపుతోంది. బీఎస్ఎఫ్‌లో 7, ఐడీబీపీలో 7, ఎస్ఎస్‌బీలో 1, సీఆర్పీఎఫ్‌లో 2 ఇద్దరు ఉన్నట్లు తెలుస్తోంది. బీఎస్ఎఫ్‌లో ఉద్యోగాలు సాధించిన ముగ్గురిపై ఇచ్చోడ, ఇంద్రవెల్లి పోలీస్టేషన్‌లో కేసులు నమోదైన విషయం విదితమే. మరో 14 మంది నకిలీ పత్రాలతో ఉద్యోగాల్లో కొనసాగుతుండటంతో ఎస్పీ అఖిల్ మహాజన్ ఈఘటనను సీరియస్‌గా తీసుకున్నారు. ఉట్నూర్ ఏఎస్పీ కాజల్‌సింగ్‌ను విచారణ అధికారిగా నియమించారు. ఆమె నేతృత్వంలో ఇప్పటికే పోలీసులు విచారణ కొనసాగిస్తున్నారు. రెండు రోజుల నుంచి మీ సేవ కేంద్రాలను తనిఖీలు చేసి నిర్వాహకులను విచారించారు. గత ఐదునెలల వ్యవధిలో ఇచ్చోడ మండలం ఇస్లాంనగర్ నుంచి నివాస ధృవీకరణ పత్రాల కోసం 180 మంది దరఖాస్తులు చేసుకున్నట్లు సమాచారం. ఇతర రాష్ట్రాల యువకుల దరఖాస్తులు స్థానిక తహసీల్దార్ కార్యాలయంలో రిజెక్ట్ చేసిన తిరిగి ఒక్కక్కరు రెండు, మూడుసార్లు దరఖాస్తులు చేసుకోవడం వెనుక దాగి ఉన్న అసలు రహస్యం అంతుపట్టడం లేదు. ఏది ఏమైన నివాస ధ్రువీకరణ పత్రాలను మార్ఫింగ్ చేసి భద్రత దళాల్లో ఉద్యోగం పొందడంపై జిల్లాలో హాట్ టాపిక్‌గా మారింది. స్థానికంగా ఉండేవారి ఆధార్, రేషన్‌కార్డు పత్రాలతో దరఖాస్తు చేయడం, ఈ దిశగా పోలీసుల విచారణ కొనసాగిస్తున్నట్లు సమాచారం.

ఆశ్రమ పాఠశాలల్లో ఉత్తమ ఫలితాలు

ఉట్నూర్‌రూరల్: ఐటీడీఏ పరిధిలోని ఆశ్రమ పాఠశాలల్లో పదో తరగతి విద్యార్థులు ఉత్తమ ఫలితాలు సాధించారు. బుధవారం ఐటీడీఏ పీవో ఖుష్బూ గుప్తా తన క్యాంపు కార్యాలయంలో డీడీ అంబాజీ, ఏసీఎంవో జగన్‌ను అభినందించారు. గత సంవత్సరంతో పోల్చుకుంటే ఈసారి 96 శాతం ఫలితాలు సాధించినట్లు ఏసీఎంవో జగన్ తెలిపారు. ఉమ్మడి జిల్లాలో 108 పాఠశాలలు, అందులో 65 పాఠశాలలు వంద శాతం వచ్చాయని పేర్కొన్నారు. గిరిజన ఆశ్రమ పాఠశాలల్లో పదిలో ఉత్తమ ఫలితాలు సాధనకు ఐటీడీఏ పీవో సారథ్యంలో చేపట్టిన మిషన్ లక్ష్యం ఎంతో మేలు చేసిందన్నారు. వచ్చే ఏడాదిలో పదిలో వందశాతం ఫలితాలు సాధించేలా కృషిచేయాలని ఐటీడీఏ పీవో పేర్కొన్నారు.



డీడీ, ఏసీఎంవోలను అభినందిస్తున్న ఐటీడీఏ పీవో ఖుష్బూ గుప్తా

మూడు కిలోమీటర్లు వెళ్తేనే నీరు



ఇంద్రవెల్లి మండలంలోని తేజాపూర్ పంచాయతీ పరిధిలోని సాలేగూడలో నీటి కోసం గ్రామస్తులు ఇక్కట్లు ఎదుర్కొంటున్నారు. గ్రామానికి మిషన్ భగీరథ నీరు రాకపోవడంతో అవస్థలు పడుతున్నారు. గ్రామశివారులో వ్యవసాయ బోరు బావుల నుంచి, ట్యాంకర్ ద్వారా నీటిని తెచ్చుకుంటున్నారు. ప్రస్తుతం బోరుబావులు అడుగంటడంతో నీళ్లు రావడం లేదు. అధికారులకు విన్నవించినా పట్టించుకోవడం లేదని వాపోతున్నారు. గ్రామానికి 3 కి.మీ దూరంలో సిరికొండ మండలం రాంపూర్‌కు బైక్‌లు, ఎడ్లబండ్లపై నీటిని తెచ్చుకుంటున్నారు. కలెక్టర్ రాజర్షి షా, ఖానాపూర్ ఎమ్మెల్యే వెడ్మ బొజ్జు పటేల్ స్పందించి గ్రామంలో నీటి సమస్యను పరిష్కరించాలని వారు కోరుతున్నారు. – ఇంద్రవెల్లి